జనంలోంచి మళ్లీ వనంలోకి..





4లో.



RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103



సంపుటి - 1 సంచిక - 153 ఆదివారం 25 ఫిబ్రవరి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# జీవో నెం.317పై పునరాలోచన?

## మంత్రి రాజనర్సింహ నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ

- 2016లో తెలంగాణలో కొత్త జిల్లాలు
- కొత్త జిల్లాలకు అనుగుణంగా కొత్త జోన్ల ఏర్పాటు
- 2021లో జీవో నెం.317 తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉద్యోగుల సర్దుబాటు కోసం జీవో... తీవ్రంగా వ్యతిరేకించిన ఉద్యోగులు
- ఉద్యోగుల అభ్యంతరాలపై దృష్టి సారించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో 2016లో అప్పటి ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కొత్త జిల్లాలతో పాటే కొత్త జోన్లు కూడా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో, కొత్త జిల్లాలు, కొత్త జోన్లకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటు కోసం 2021లో జీవో నెం.317 తీసుకువచ్చారు. ఆ సమయంలో ఉద్యోగులు జీవోపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఉద్యోగులు తమ స్థానికతను కోల్పోయే విధంగా జీవో నెం.317 ఉందని ఉద్యోగ సంఘాలు తీవ్రస్థాయిలో ఉద్యమించాయి. నాడు, విపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూడా ఉద్యోగులకు మద్దతు పలికి పోరుబాట పట్టింది.
ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో... సీఎం రేవంత్ రెడ్డి జీవో నెం.317పై దృష్టి సారించారు. ఉద్యోగుల అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు.
మంత్రి రాజనర్సింహ ఈ సబ్ కమిటీకి చైర్మన్ గా వ్యవహరిస్తారు. ఇందులో శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. ఈ జీవోలో పేర్కొన్న అంశాలు, ఉద్యోగుల అభ్యంతరాలు, వివాదాలను ఈ సబ్ కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసులతో కూడిన నివేదిక అందించనుంది.

# మేడారం మహా జాతర సక్సెస్ ..

## 1.35 కోట్ల మంది రాక: మంత్రి సీతక్క



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** మేడారం మహా జాతర విజయవంతమైందని, నాలుగు రోజుల్లో కోటి నలభై లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మంత్రి సీతక్క తెలిపారు. మేడారం జాతర నేటితో ముగియడంతో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తక్కువ సమయంలోనే జాతరకు ఏర్పాట్లు చేశామన్నారు.అమ్మవార్ల వన ప్రవేశం కాసేపట్లో జరుగనుంది. వనప్రవేశం పూర్తయినా భక్తుల రద్దీ కొనసాగుతుందని చెప్పారు. రేపటి వరకు కూడా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. 4వేల మంది పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. జాతరకు నిధులిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, క్యాబినెట్ మంత్రులకు, సహకరించిన భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

# పీనల్ కోడ్ స్థానంలో కొత్త క్రిమినల్ చట్టాలు...


## జులై 1 నుంచి అమలు

**ఇప్పటివరకు భారత్ లో ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ ల అమలు**

**వాటి స్థానంలో మూడు కొత్త చట్టాలకు కేంద్రం రూపకల్పన**

**గత పార్లమెంటు సమావేశాల్లో కొత్త చట్టాలకు ఆమోదం**

**రాజముద్ర వేసిన రాష్ట్రపతి ముర్ము**



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** బ్రిటీష్ వలస పాలన నాటి క్రిమినల్ చట్టాలకు ఇక కాలం చెల్లింది. వాటి స్థానంలో కొత్త క్రిమినల్ చట్టాలను భారత కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాలు జులై 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్రం నేడు ప్రకటించింది. ఈ కొత్త చట్టాల పేర్లు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష్య. ఇండియన్ పీనల్ కోడ్-1860, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్పీసీ)-1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872 చట్టాల స్థానంలో కొత్త చట్టాలు అమల్లోకి రానున్నాయి. ఈ మూడు చట్టాలకు పార్లమెంటు ఆమోదం లభించగా, గత డిసెంబరులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా రాజముద్ర వేశారు. తాజాగా, కొత్త క్రిమినల్ చట్టాల అమలు తేదీపై గెజిట్ విడుదల చేశారు

# సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌పై నగదు బదిలీకే ప్రభుత్వం మొగ్గు


2లో




**ఆయిల్ కంపెనీల నిబంధనలు, ఇతర ఆర్థిక అంశాల ఆధారంగా సబ్సిడీ వైపు మొగ్గు**

**ఇందుకు సంబంధించిన విధివిధానాల ఖరారు**

# తెలంగాణ ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా చిన్నారెడ్డి



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకంది. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి చిన్నారెడ్డికి కీలక పదవి ఇచ్చింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియమించింది.ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చిన్నారెడ్డికి కేబినెట్ ర్యాంగ్ హెూదా కల్పించింది. కాగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చిన్నారెడ్డి సీటు త్యాగం చేశారు. ఆయన స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మేఘారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి నిరంజన్ రెడ్డిపై గెలుపొందారు.గతంలో చిన్నారెడ్డి వనపర్తి నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో, 2004లో, 2014 ఎన్నికల్లో చిన్నారెడ్డి గెలుపొందారు.

# 'ధరణి' నిర్వహణ ఏజెన్సీపై విచారణకు ఆదేశం

## రైతుల వివరాలు విదేశీ కంపెనీల చేతుల్లో ఎలా పెట్టారు?: రేవంత్‌రెడ్డి



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** 'ధరణి' సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనే వీటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు.ధరణి సమస్యల పరిష్కారం, కమిటీ గుర్తించిన అంశాలపై శనివారం సచివాలయంలో చర్చించారు. మార్చి మొదటి వారంలోగా 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. దీనిపై విధివిధానాలు రూపొందించాలన్నారు.2020 ఆర్‌వోఆర్ చట్టంలోనే లోపాలున్నాయని ధరణి కమిటీ తెలిపింది. "గత ప్రభుత్వం కేవలం 3 నెలల్లోనే సమగ్ర భూ సర్వే చేసింది. హడావుడిగా చేయడం వల్లే కొత్త చిక్కులు వచ్చాయి. పోర్టల్‌లో లోపాలు సవరించాలంటే చట్ట సవరణ లేదా కొత్త ఆర్‌వోఆర్ చట్టం చేయాలి. వివాదాలు లేకుండా భూరికార్డుల ప్రక్షాళన చేయాల్సి ఉంది" అని పేర్కొంది. కమిటీ తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వెంటనే పరిష్కరించాల్సిన సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు.
ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. పోర్టల్‌ను ప్రైవేటు ఏజెన్సీలకు ఎందుకు ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. గోప్యంగా ఉండాల్సిన లక్షలాది రైతుల ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, భూ రికార్డులు విదేశీ కంపెనీల చేతుల్లో ఎలా పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డేటా భద్రంగా ఉన్నట్లేనా? రికార్డులను విదేశీ కంపెనీలకు ఇచ్చే నిబంధనలున్నాయా? అని ప్రశ్నించారు. బిడ్ దక్కించుకున్న కంపెనీ మారితే ప్రభుత్వం ఎలా అంగీకరించిందన్నారు.

# వీఐపీల డ్రైవర్లందరికీ ఫిట్ నెస్ పరీక్షలు

## నైపుణ్యం లేని వారిని డ్రైవర్లుగా పెట్టుకోవద్దన్న మంత్రి పొన్నం ప్రభాకర్



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ యువ నేత లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఈ ఘటన దిగ్భ్రాంతి కలిగించింది. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీఐపీల డ్రైవర్లందరికీ ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రభుత్వం దీన్ని సుమోటోగా తీసుకుందని తెలిపారు. మొత్తం 33 జిల్లాల్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రముఖుల డ్రైవర్లకు ఫిట్ నెస్ టెస్టులు నిర్వహిస్తారని వివరించారు. డ్రైవింగ్ నైపుణ్యం లేని వారిని విధుల్లో పెట్టుకోవద్దని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాజకీయ నేతలకు పొన్నం ప్రభాకర్ సూచించారు

# ఐదు రాష్ట్రాల్లో ఆప్-కాంగ్రెస్ పార్టీల పొత్తు..

## పంజాబ్‌లో కుదరని దోస్తీ





**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
లోక్‌సభ ఎన్నికల కోసం ఐదు రాష్ట్రాల్లో కాంగ్రెస్–ఆప్ మధ్య పొత్తు కుదిరింది. ఢిల్లీ సహా గుజరాత్, హర్యానా, చండీగఢ్, గోవాలో సీట్ల షేరింగ్ కొలిక్కి వచ్చింది.

ఐదు రాష్ట్రాల్లో ఆప్ – కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తున్నట్లు ప్రకటించాయి. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం 7 లోక్‌సభ స్థానాలకు గానూ ఆప్ నాలుగు స్థానాల్లో పోటీ చేయనుంది. ఆప్ పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, తూర్పు ఢిల్లీ, న్యూఢిల్లీలో పోటీ చేయనుంది. కాంగ్రెస్ నార్త్ ఈస్ట్ ఢిల్లీ, నార్త్ వెస్ట్ ఢిల్లీ, చాందినీ చౌక్ స్థానాల్లో బరిలో నిలవనుంది.గుజరాత్‌లో 26 లోక్‌సభ స్థానాలకు గానూ కాంగ్రెస్ 24 స్థానాల్లో పోటీ చేయనుంది. ఆప్‌కు రెండు స్థానాలు కేటాయించారు. భరూచ్, భావ్‌నగర్‌లో ఆప్ అభ్యర్థులు పోటీ చేయనున్నారు. హర్యానాలో మొత్తం 10 లోక్‌సభ స్థానాలకు గానూ కాంగ్రెస్‌కు 9 స్థానాల్లో పోటీకి దిగనుంది. ఆప్ ఒక్కస్థానం కురుక్షేత్రలో బరిలో నిలవనుంది. గోవా, చండీగఢ్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ మాత్రమే పోటీలో నిలిచేలా ఒప్పందం కుదిరినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ముకుల్ వాస్నిక్ తెలిపారు. గోవా, చండీగఢ్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బరిలో దిగనుంది. గోవాలో ఉన్న రెండు లోక్?సభ నియోజకవర్గాలు, చండీగఢ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పోటీ చేయనుంది.మరోవైపు పంజాబ్‌లో ఇరు పార్టీల మధ్య ఎలాంటి పొత్తు ఉండబోదని ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. పంజాబ్‌లో మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. పంజాబ్, ఢిల్లీలో పాత ప్రత్యర్థులైన ఆప్ %--% కాంగ్రెస్ గత నెలలో జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసి సుప్రీంకోర్టు జోక్యంతో విజయం సాధించాయి

# సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌పై నగదు బదిలీకే మొగ్గు

**ఆయిల్ కంపెనీల నిబంధనలు, ఇతర ఆర్థిక అంశాల ఆధారంగా సబ్సిడీ వైపు మొగ్గు**
**ఇందుకు సంబంధించిన విధివిధానాల ఖరారు**
**సిలిండర్ తీసుకునేటప్పుడు లబ్ధిదారులు మొత్తం ధర చెల్లించాలి**
**అనంతరం, వారి బ్యాంకు ఖాతాలోకి రూ.500 పోను మిగిలిన మొత్తం బదిలీ**
**నగదు బదిలీకి ప్లాట్‌ఫాంగా ఎన్‌పీసీఐ**




**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌ల సరఫరాపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నగదు బదిలీ విధానంలోనే రూ.500కు గ్యాస్ సిలిండర్లను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విధానంలో వినియోగదారులు సిలిండర్ తీసుకునేటప్పుడు పూర్తి ధర చెల్లిస్తారు. ఆ తరువాత ప్రభుత్వం రూ.500 సబ్సిడీ పోను మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేస్తుంది. ఇక పథకం అమలుకు సంబంధించి వివిధ విధానాలను కూడా పౌరసరఫరాల శాఖ ఖరారు చేసింది. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రూ.500కే సిలిండర్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

### రూల్స్ ఇవే..

కొత్తగా తీసుకునే గ్యాస్ కనెక్షన్లకు పథకం వర్తించదు.
ఆహారభద్రత కార్డులున్న వారికి, అందునా వాడకంలో ఉన్న సిలిండర్లకే సబ్సిడీ వర్తింపు
గృహవినియోగదారులు గడిచిన మూడేళ్లలో వినియోగించిన సగటు సిలిండర్ల సంఖ్య ఆధారంగా సబ్సిడీ సిలిండర్ల సంఖ్య ఖరారు
ప్రస్తుతానికి 40 లక్షల మంది మహిళా అభ్యర్థుల ఖరారు. వీరితోనే పథకం ప్రారంభంఈ పథకంలో నగదు బదిలీకి ప్లాట్‌ఫాంగా వ్యవహరించనున్న ఎన్‌పీసీఐ. లబ్ధిదారులకు సిలిండర్ల సరఫరా తరువాత ఎన్‌పీసీఐ.. నోడల్ బ్యాంకులో ఉన్న సొమ్ము నుంచి లబ్ధిదారులకు నగదు బదిలీ చేస్తుంది. ఆయిల్ కంపెనీల నిబంధనలు, ఇతర ఆర్థిక అంశాలు, అవకతవకలు జరిగే అవకాశం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. కాగా, పౌరసరఫరా శాఖ కమిషనర్ గురువారం సాయంత్రం గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించి పలు అంశాలపై చర్చ జరిగింది.

# వచ్చే ఐదేళ్లలో వేలాది గోదాములు

## రూ.1.25 లక్షల కోట్లతో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం:: మోదీ



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
న్యూఢిల్లీ: దేశంలో సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమం అమలుకు రూ.1.25 లక్షల కోట్లకుపైగా నిధులు వెచ్చించనున్నారు. అలాగే వచ్చే ఐదేళ్లలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సృష్టించనున్నారు. ఇందులో భాగంగా 11 రాష్ట్రాల్లో 11 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీ) పరిధిలో నిర్మించిన 11 గోడౌన్లను మోదీ ప్రారంభించారు.రాబోయే ఐదేళ్లలో వేలాది గోదాములు నిర్మించబోతున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. 500 పీఏసీల పరిధిలో గోదాముల నిర్మాణానికి, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన పనులకు మోదీ శంకుస్థాపన చేశారు. 18,000 పీఏసీలను కంప్యూటీకరించే ప్రాజెక్టును ప్రారంభించారు. దేశంలో ఆహార ధాన్యాల నిల్వకు సరైన సదుపాయాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

ఈ సమస్యను గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదని తప్పుపట్టారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ.1.25 లక్షల కోట్లలో వ్యయంతో రాబోయే ఐదేళ్లలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం సృష్టించే పథకానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చని, వాటిపై రుణం పొందవచ్చని, మార్కెట్‌లో సరైన ధర లభించినప్పుడు పంటలు విక్రయించుకోవచ్చని తెలియజేశారు.

### క్యాబినెట్ భేటీకి యాక్షన్ ప్లాన్‌తో రండి

**కేంద్ర మంత్రులకు ప్రధాని మోదీ సూచన**

లోక్‌సభ ఎన్నికలు మరో 100 రోజులలోపే జరుగనున్న నేపథ్యంలో మార్చి 3వ తేదీన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయించారు. ఈ భేటీని ఆయన కీలకంగా భావిస్తున్నారు. స్పష్టమైన, ఆచరణ యోగ్యమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని కేబినెట్ సమావేశానికి హాజరు కావాలని మంత్రులకు ఆయన సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు శనివారం వెల్లడించాయి. కేబినెట్ భేటీలో మంత్రులంతా వారి యాక్షన్ ప్లాన్ సమర్పించాలని ప్రధానమంత్రి పేర్కొన్నట్లు తెలియజేశాయి.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేయాలి

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దామరచర్ల మండలంలో థర్మల్ పవర్ ప్రాజెక్టు సందర్శన ,మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం**

**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
శనివారం ఉదయం మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో నిర్మాణంలో ఉన్న థర్మల్ పవర్ ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందుగా థర్మల్ పవర్ స్టేషన్లో స్థానికుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్, అధికారులు, కాంగ్రెస్ నేతలు మంత్రుల బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రాజెక్టు పురోగతిపై చక్కటి ప్రజెంటేషన్ ఇచ్చినందుకు డిప్యూటీ సీఎం అధికారులను అభినందించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు పూర్తి అవగాహన ఉందని.. గతంలో వీరిద్దరూ ఎంపీలుగా ఉన్న క్రమంలో ప్రాజెక్టు పురోగతికి కృషి చేశారని వివరించారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇద్దరు మంత్రుల సంపూర్ణ సహకారం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



### పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి

ఇప్పటికే రెండుసార్లు ప్రాజెక్టు అంచనా వ్యయాలు పెంచడంతో బడ్జెట్ భారీగా పెరిగిందని ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారంగా మారిందని, ప్రజలకు ఆందోళన కలుగుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టును తొందరగా పూర్తి చేయకపోతే మోయలేని భారంగా మారుతుంది అన్నారు. అందుకే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాం, ఈ క్రమంలోనే థర్మల్ పవర్ స్టేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. గతంలో హైదరాబాద్‌లో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉన్న స్కిల్డ్, అన్ స్కిల్డ్ అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఆలోచన చేయాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న అన్ స్కిల్డ్ లేబర్ ఎక్కడి నుంచి వస్తున్నారు వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు సమాధానం ఇస్తూ ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత స్థానికులకే అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరితగతన ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఒక వ్యవస్థను, ఓ సమర్థమైన అధికారిని నియమించుకోవాలని సూచించారు.

### బీహెచ్ఈఎల్.. పనుల్లో వేగం పెంచాలి

రోడ్లు, రైల్వే వంటి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారి మంత్రులతో, ఉన్నత స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటారని తెలిపారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఓ పాలసీని రూపొందించాలని అధికారులు భావిస్తే అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వ పక్షాన ఎల్లవేళలా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. మారుతున్న పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుత్తు రంగాల వైపు వెళ్తున్నారని వివరించారు. సోలార్, హైడ్రో, విండ్ ఎనర్జీ వంటి గ్రీన్ ఎనర్జీ రంగాలు విస్తృతంగా పెరుగుతున్నాయి, అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలోపు యాదాద్రి థర్మల్ పవర్ పనులు పూర్తి కావాలన్నారు. గత ప్రభుత్వం యాదాద్రి, భద్రాద్రిలో థర్మల్ వైపు మొగ్గు చూపిందని అన్నారు. పునరుత్పాదక విద్యుత్తు తక్కువ ధరకు, కాలుష్యరహితంగా అందుబాటులోకి వస్తుందన్నారు. బీహెచ్ఈఎల్ యాదాద్రి పనులను త్వరగా పూర్తి చేయాలని.. ఈ విషయాన్ని సంస్థ అధికారులు, ఇంజనీర్లు దృష్టిలో పెట్టుకోవాలని మందలించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచనలు, అలవాట్లు పద్ధతులు మార్చుకోకపోతే ప్రాజెక్టు వ్యయం పెరిగి



ప్రతి రూపాయి రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారుతుంది అన్నారు.ప్రాజెక్టుకు అవసరమైన ముడి పదార్థాలు అందించేందుకు మైనింగ్ కార్పొరేషన్ సిబ్బంది సిద్ధంగా ఉందన్నారు. అవసరమని భావిస్తే వారితో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టు సంపద రాష్ట్ర ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలని సూచించారు. ఈ ఆశయం నెరవేర్చే క్రమంలో అధికారులు ఎలాంటి బెదిరింపులకు లొంగాల్సిన పని లేదన్నారు. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు 24/7 తనతోపాటు సీనియర్ మంత్రులు, అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు కనిపిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. ప్రాజెక్టు పురోగతి పనుల గురించి ప్రశ్నించగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో రెండు యూనిట్ల ద్వారా 1600 మెగావాట్ల విద్యుత్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తామని, మార్చి 20 25 నాటికి మొత్తం ఐదు యూనిట్ల ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెస్తామని వివరించారు.

# రెండో అదనపు సివిల్ జడ్జ్ కోర్టు, ఈ సేవా కేంద్రాలను ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే





**సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సేవ కేంద్రము, రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే పోలీసుల గౌరవ వందనం ను స్వీకరించారు. అనంతరం ఆయన వాటిని ప్రారంభించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కి సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ, రాజగోపాల్, సబ్ జడ్జి జి, శ్రీవాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే, సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జె, ప్రశాంతి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట హైకోర్టు న్యాయమూర్తులు టి, వినోద్ కుమార్, కె, లక్ష్మణ్, బి, విజయసేన్ రెడ్డి, పుల్ల కార్తీక్, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, జనరల్ సెక్రెటరీ పోలెబోయిన నర్సయ్య యాదవ్, డి.ఎస్పీ జి, రవి, న్యాయవాదులు, కోర్టు పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు

## - పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దంపతులు



**రాయపర్తి, ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం సన్నూర్ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎర్రబెల్లి దంపతులను ఆలయ నిర్వాహకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలు సాధ్యాసాధ్యాలను తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉంది..!

## భారత ప్రధాన ఎన్నికల కమిషర్ రాజీవ్‌కుమార్

**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
చెన్నై: రాజకీయ పార్టీలు ఇచ్చే ఎన్నికల హామీల అమలు విషయంలో సాధ్యాసాధ్యాల గురించి తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉందని భారత ప్రధాన ఎన్నికల కమిషర్ రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు.
అలాగే తమ ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానాలు చేసే హక్కు పార్టీలకు ఉందని చెప్పారు. చెన్నైలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఈసీ మాట్లాడుతూ.. పార్టీల హామీలపై ఎన్నికల సంఘం ఒక నమూనా పత్రాన్ని సిద్ధం చేసిందని, అయితే.. ఈ మొత్తం వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు.
"తమిళనాడులో భాజపా, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలు.. డీఎంకే, అన్నాడీఎంకే వంటి రాష్ట్ర పార్టీలను కలిశాం. వాటిలో చాలావరకు స్థానికంగా




ఒకే దశలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశాయి. ఓటర్లకు పంపిణీ చేసేందుకు అనేక పార్టీలు నిధులు కూడబెడుతున్నట్లు ఆరోపించాయి. ఈనేపథ్యంలో.. నగదు, మద్యం, ఆన్‌లైన్ ద్వారా డబ్బు బదిలీ వంటి ప్రలోభాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరాయి" అని సీఈసీ వెల్లడించారు. ప్రలోభాలను అడ్డుకునేందుకు సంబంధిత సంస్థలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.
ఆన్‌లైన్ లావాదేవీలపై దృష్టిసారించాలని 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్'కు సూచించినట్లు సీఈసీ రాజీవ్‌కుమార్ చెప్పారు. ఫేక్ న్యూస్‌పై మాట్లాడుతూ.. 'ఇటీవల లోక్‌సభ ఎన్నికల తేదీలు వెల్లడైనట్లు నకిలీ వార్తలు చక్కర్లు కొట్టాయి. మా దృష్టికి వచ్చిన అరగంటలోపే వాటికి అడ్డుకట్ట పడేలా స్పష్టత ఇచ్చాం" అని తెలిపారు. ఇదిలాఉండగా.. తమిళనాడులో పర్యటిస్తోన్న సీఈసీ, ఇతర ఉన్నతాధికారులు.. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశమైన విషయం తెలిసిందే

# రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



శాయంపేట, ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త): శాయంపేట మండలం కొప్పుల గ్రామం నుండి పరకాల వరకు నిర్మించబోయే రోడ్డు నిర్మాణ పనులు శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్.టి.ఎస్డి.ఎఫ్ ద్వారా మంజూరైన 7 కోట్ల నిధులతో రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వారి వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, పరకాల మాజీ ఏఎంసీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఏరుకొండ శంకర్, నిమ్మల రమేష్, రవిరామ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# చెరకు సాగు, నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం ఒకేసారి: శ్రీధర్ బాబు

**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్: ఐదేళ్లలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పూర్తి చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సిఫార్సుల కమిటీ సందర్శించింది.
ఛైర్మన్ శ్రీధర్ బాబు, సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి.. రైతులు, కార్మికులు, రాజకీయ పక్షాల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చక్కెర పరిశ్రమను ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందని



శ్రీధర్‌బాబు తెలిపారు. చక్కెర పరిశ్రమ ప్రారంభం, చెరకు సాగు ఒకేసారి జరగాలని పేర్కొన్నారు.
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పరిశ్రమ పునరుద్ధరణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. లాభాల్లో ఉండే విధంగా ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. చెరకు రైతులకు పర్చేస్ ట్యాక్స్, సబ్సిడీని పరిశీలిస్తున్నామని, ట్రాన్స్ పోర్టు సబ్సిడీ, కొత్త వంగడాలపై దృష్టి సారించామని తెలిపారు.

# భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలి

## - మంత్రిని కలిసిన ఎమ్మెల్యే యశస్విని



పాలకుర్తి, ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త): పాలకుర్తి నియోజకవర్గం చెన్నూరు, బొమ్మెర గ్రామాల్లో రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగు నీరు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ బాధిత రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. వారి వెంట పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి జాన్సీరెడ్డి తదితరులు ఉన్నారు.

# సిఎస్ఐ సెంట్ పాల్స్ చర్చి శత సంవత్సర వేడుకలు


## - పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ ప్రదర్శన



**పరకాల, ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** పరకాల పట్టణ కేంద్రంలోని సిఎస్ఐ సంస్థను స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం శత సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా పరకాల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుండి సంఘం సభ్యులతో కలిసి చర్చి వరకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. డీజే సౌండ్ సిస్టం ఆట పాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రెవ, రూబెన్ మార్క్ బిషప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్ఐ సంస్థను స్థాపించిన కాలం నుండి నేటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన ఘనత ఆ సంస్థకు దక్కిందన్నారు. ఈ వేడుకల్లో పరకాల నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల వారిగా పాస్టర్లు, వివిధ సంఘాల వారు వేడుకల్లో పాల్గొన్నారు.

# నాకేం గుర్తుకు రావడం లేదు

**నిద్రమత్తులో కళ్లు మూసుకుపోయాయి..**
**అంతలోనే ప్రమాదం జరిగింది**
**లాస్య నందిత కారు డ్రైవర్ వాంగ్మూలం**
**కుట్ర కోణం ఉందా? పోలీసుల దర్యాప్తు**



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** : 'ఏం తెలియదు సార్, అసలు ఏం గుర్తుకు రావడం లేదు. కళ్లు తెరిచి చూసే లోగా ప్రమాదం జరిగిపోయింది.' ఇది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు డ్రైవర్ ఆకాశ్ పోలీసులు ముందు చెప్పిన వాంగ్మూలం! ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆకాశ్ ప్రస్తుతం మియాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో నిద్ర మత్తుతో కళ్లుమూసుకుపోయాయని చెప్పారు. ఏం జరిగిందో తనకు గుర్తులేదని అంతా క్షణాల్లో జరిగిపోయిందని చెప్పినట్లు తెలిసింది. ఈ మేరకు ఆకాశ్ నుంచి న్యాయమూర్తి, డీఎస్పీ వాంగూల్మం రికార్డు చేశారు. ప్రమాదంలో కాళ్లు విరిగిన ఆకాశ్‌కు ఆపరేషన్ చేశారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు.
మరోవైపు లాస్య నందిత కారు ప్రమాద ఘటనపై పోలీసులు క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. ఓఆర్ఆర్‌పై ఉన్న అన్ని సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించి విశ్లేషిస్తున్నారు. కారు రింగ్ రోడ్డుపై ఎంత వేగంగా వెళ్లింది. సాధారణ ప్రమాదమా?
ఏదైనా కుట్ర కోణం ఉందా? అని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదానికి గురైన కారు విడిభాగాలు విసిరేసినట్లు పడి ఉండటంతో రెయిలింగ్‌ను ఢీకొనడానికి ముందు మరో వాహనాన్ని ఢీకొట్టిందేమో అని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి గురైన సమయంలో ముత్తంగి జంక్షన్ వైపు అటుగా వెళ్ళిన వాహనాల వివరాలను సేకరించే పనిలో పటాన్‌చెరు పోలీసులు నిమగ్నమయ్యారు. ఇంతవరకు ఎలాంటి వాహనం ఆచూకీ లభ్యం కాలేదు. అయితే టిఫిన్ కోసం శామీర్‌పేట నుంచి పటాన్‌చెరు వరకు ఎమ్మెల్యే రావడానికి దారితీసిన కారణాలను తెలుసుకునే పనిలో పడ్డారు.

# పవన్ ని చూస్తే జాలేస్తుంది




**పవన్ అత్యంత దయనీయం స్థితిలో ఉన్నారు... సజ్జల**
**24 స్థానాల్లో పవన్ వైసీపీపై యుద్ధం చేయగలరా అని ప్రశ్నించిన సజ్జల**
**జనసేన అభ్యర్థులను కూడా చంద్రబాబే నిర్ణయిస్తారా అంటూ వ్యాఖ్యలు**
**పవన్ కు తాను పోటీ చేసే స్థానంపైనే స్పష్టత లేదని ఎద్దేవా**

**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** టీడీపీ-జనసేన కూటమి తొలి జాబితా ప్రకటించడంపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శనాత్మకంగా స్పందించారు. ఈ జాబితా చూస్తుంటే పవన్ కల్యాణ్ అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారన్న విషయం అర్థమవుతోందని అన్నారు. 24 స్థానాలతో పవన్ వైసీపీపై యుద్ధం చేయగలనని అనుకుంటున్నారా? అని సజ్జల ప్రశ్నించారు. కనీసం ఆ 24 స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించలేని స్థితిలో ఉన్న పవన్ ను చూస్తే జాలేస్తోందని వ్యంగ్యం ప్రదర్శించారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి రెండు చోట్లా ఓడిపోయిన పవన్ కు ఈసారి కనీసం తాను పోటీ చేసే స్థానంపై కూడా స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. మిగిలిన స్థానాల్లో కూడా టీడీపీ అభ్యర్థులే ఉంటారని, పవన్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్ష పదవి తీసుకుంటే బాగుంటుందని సెటైర్ వేశారు. "పవన్ ను అభిమానించే వాళ్లు ఇకనైనా ఆలోచించాలి. చంద్రబాబుకు ఎందుకు మద్దతు ఇస్తున్నాడో పవన్ చెప్పలేకపోతున్నాడు. ఇటీవలి వరకు ఎన్నో మాటలు చెప్పిన పవన్ ఇప్పుడెందుకు దిగజారిపోయారు? జనసేన అభ్యర్థులను కూడా చంద్రబాబే నిర్ణయిస్తారా? ఓ రాజకీయ పార్టీని నడిపే లక్షణాలు పవన్ కల్యాణ్ కు లేవని స్పష్టంగా తెలిసిపోయింది" అంటూ సజ్జల విమర్శనాస్త్రాలు సంధించారు. ఎవరు ఎన్ని సీట్లలో, ఎక్కడ పోటీ చేసినా వైసీపీకి వచ్చిన ఇబ్బందేమీ లేదని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది వైసీపీనే అని ధీమా వ్యక్తం చేశారు.

# పవర్ ఫుల్ జాబితా

- టీడీపీ, జనసేన ఫస్ట్ లిస్ట్ రిలీజ్
- అభ్యర్థుల పేర్లు ప్రకటించిన చంద్రబాబు, పవన్
- 118 స్థానాల్లో ఉమ్మడి అభ్యర్థుల పేర్లు వెల్లడి
- ఇందులో 94 మంది టీడీపీ అభ్యర్థులు
- జనసేనకు 3 లోక్‌సభ, 24 అసెంబ్లీ సీట్లు కేటాయింపు
- అయిదుగురి పేర్లు ప్రకటించిన జనసేనాని పవన్
- మిగిలిన అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్న బాబు



**ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో టీడీపీ - జనసేన తొలి జాబితాను విడుదల చేశారు. 24 అసెంబ్లీ, 3 లోక్ సభ సీట్లలో జనసేన పోటీ చేస్తుందని చంద్రబాబు ప్రకటించారు. అలాగే టీడీపీ పోటీ చేసే 94 అసెంబ్లీ స్థానాల తొలి జాబితాను చంద్రబాబు విడుదల చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకడమే కూటమి లక్ష్యమని చంద్రబాబు, పవన్ అన్నారు. ప్రయోగాల జోలికి వెళ్లకుండా, తక్కువ సీట్లైనా పర్వాలేదనే, అన్నీ ఆలోచించే తాము ముందడుగు వేశామని పవన్ చెప్పారు. నాయకులంతా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి, రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయాలని పవన్ సూచించారు. టీడీపీ ఓటు జనసేనకు ఎంత ముఖ్యమో, జనసేన ఓటు టీడీపీకి అంతే ముఖ్యమని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎట్టి పరిస్థితుల్లో చీలకూడదని అన్నారు. జనసేన - టీడీపీ కూటమికి బీజేపీ మద్దతు ఉందని తెలిపారు.



# జనంలోంచి మళ్లీ వనంలోకి..

- విజయవంతంగా ముగిసిన మహాజాతర
- తిరిగి వనంలోకి సమ్మక్క సారలమ్మ
- పగిడిద్దరాజు, గోవిందరాజులు
- చివరి రోజున పోటెత్తిన భక్తులు
- వనదేవతలను దర్శించుకున్న
- స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎంపీ వద్దిరాజు తదితరులు
- దర్శనాల అనంతరం భక్తుల తిరుగు ప్రయాణం
- ఆర్టీసీ ప్రాంగణం వద్ద కిక్కిరిసిన క్యూలైన్లు
- జాతర విజయవంతానికి సహకరించిన
- అందరకీ మంత్రి సీతక్క ధన్యవాదాలు








**మేడారం, ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం మహాజాతర శనివారం విజయవంతంగా ముగిసింది. గిరిజన వనదేవతా మూర్తులైన సమ్మక్క సారలమ్మలు కొలువుదీరిన గద్దెలపై నుండి తిరిగి వనంలోకి ప్రవేశించారు. గత మూడు రోజులుగా భక్తులకు దర్శనాలు కల్పించి వారి కోరికలను కొంగుబంగారంగా తీర్చే సమ్మక్క సారలమ్మలను గిరిజన సాంప్రదాయాల ప్రకారం వారి గద్దల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించిన గిరిజనులు.. సమ్మక్కను శనివారం సాయంత్రం 6:40 నిమిషాలకు డోలు సప్పులతో ఘనంగా ఊరేగింపుగా చిలకల గట్టుకు తీసుకెళ్లి ప్రతిష్ట చేశారు. దీంతో ఈ మహా ఘట్టం విజయవంతంగా పూర్తయింది. సమ్మక్క దేవతను సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య ప్రత్యేక పూజలను నిర్వహించి కుంకుమ భరణి రూపంలో తీసుకెళ్లి మేడారంలోని చిలకలగుట్టపై తిరిగి ప్రతిష్ఠించారు. సమ్మక్క కూతురు అయిన సారలమ్మను సాయంత్రం 6 గంటలకు సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య సారలమ్మ గద్దె వద్ద ప్రత్యేక పూజలను చేసి తాడ్వాయి.
మండలంలోని కన్నెపల్లి గ్రామంలో కొలువుదీరిన సారలమ్మ గుడి వద్దకు భారీ బందోబస్తు నడుమ చేర్చారు. సమ్మక్క భర్త పగిడిద్దరాజు సాయంత్రం 5.30 గంటలకు గంగారం మండలం పూనుగుల్ల గ్రామానికి బయలుదేరాడు. సమ్మక్క మరిది (పగిడిద్దరాజు తమ్ముడు) అయిన గోవిందరాజులు సాయంత్రం 5.30 గంటలకు గోవిందరాజులు ప్రధాన పూజారి అయిన దబ్బగట్ల గోవర్ధన్ ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామానికి పగిడ రూపంలో తీసుకెళ్లి గోవింద రాజులు కొలువైన ఆయన గుడిలో ప్రతిష్ఠించారు. వన దేవతల వన ప్రవేశానికి భక్తులు భారీగా తరలివొచ్చారు. సమ్మక్కను వన ప్రవేశం చేసేటప్పుడు పోలీసులు భారీ బందోబస్తు నడుమ జనం నుండి వనంలోకి తీసుకెళ్లారు. దీనితో మేడారం మహాఘట్టం విజయవంతంగా పూర్తి అయినది. కాగా జాతర కోసం, మంత్రి సీతక్కతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార యంత్రాంగం దగ్గరుండి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షించారు. కాగా ఈ యేడు జారతలో తల్లుల దర్శనం కోసం సుమారు 1.45 కోట్లకు పైగా భక్తులు హాజరైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

### అమ్మవార్లను దర్శించుకున్న ప్రముఖులు

తెలంగాణ గవర్నర్ తమిళి సై, సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు సహా పలువురు ప్రముఖులు సమ్మక్క సారలమ్మను దర్శించుకుని నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జాతర సక్సెస్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి సీతక్క పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. చివరిరోజు సమ్మక్క, సారలమ్మల వన ప్రవేశానికి అన్ని ఏర్పాట్లను దగ్గరుండి చేశారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్ర, శనివారాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే వెల్లువలా తరలివచ్చి, భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. గంటల తరబడి క్యూలో నిలబడి మరీ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు.

### తిరుగుప్రయాణమైన భక్తులు

మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లు వనప్రవేశం పూర్తయిన నేపథ్యంలో అమ్మవార్లను దర్శించుకున్న భక్తులందరూ తిరిగి వారి వారి స్వగ్రామాలకు తరలివెళుతున్నారు. భక్తుల తిరుగు ప్రయాణం సందర్భంగా ఆర్టీసి బస్టాండ్ ప్రాంతంలోని క్యూ లైన్లు జనంతో కిక్కిరిసి పోయాయి. ఇప్పటి వరకు దాదాపు 10 వేల ట్రిప్పుల బస్సులు నడిచినట్లు అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గుడారాలు, టెంట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తమ సామగ్రినీ, పిల్లలను పట్టుకుని భక్తులు తమ తిరుగు ప్రయాణం సాగిస్తున్నారు.

# సెహ్వాగ్ ఆల్‌టైమ్ రికార్డు బద్దలు కొట్టిన జైస్వాల్




వేదిక ఏదైనా.. ప్రత్యర్థి ఎవరైనా.. ఏమాత్రం బెదురు లేకుండా బ్యాట్ ఝులిపించడమే తనకు తెలిసిన విద్య అన్నట్లుగా ముందుకు సాగుతున్నాడు టీమిండియా నయా సంచలనం యశస్వి జైస్వాల్. అరంగేట్రంలోనే వెస్టిండీస్ గడ్డపై సెంచరీతో చెలరేగి అరుదైన రికార్డులు సాధించాడు ఈ లెఫ్టాండర్ బ్యాటర్.తాజాగా స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ అదే జోరును కొనసాగిస్తున్నాడు జైస్వాల్. తొలి మూడు టెస్టుల్లో అతడు చేసిన స్కోర్లు వరుసగా.. 80, 15, 209, 17, 10, 214(నాటౌట్). తాజాగా రాంచి మ్యాచ్ సందర్భంగానూ కూడా విలువైన అర్ధ శతకం బాదాడు.నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 130 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి టీమిండియా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వేళ ఈ ఓపెనింగ్ బ్యాటర్ పట్టుదలగా నిలబడ్డాడు. వరుసగా వికెట్లు పడుతున్నా ఏకాగ్రత కోల్పోకుండా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మొత్తంగా 117 బంతులు ఎదుర్కొని 73 పరుగులు సాధించాడు. ఇందులో 8 ఫోర్లు, ఒక సిక్సర్ ఉంది.ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా అద్భుత రీతిలో బాదాడు ఆ సిక్స్‌ను జైస్వాల్. తద్వారా టీమిండియా విధ్వంసకర ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పేరు మీద 16 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు.ఒక క్యాలెండర్ ఇయర్‌లో టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు బాదిన టీమిండియా బ్యాటర్‌గా అవతరించాడు. సెహ్వాగ్ 14 మ్యాచ్‌లు ఆడి 27 ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్ నమోదు చేస్తే.. జైస్వాల్ ఐదో మ్యాచ్‌లోనే ఈ ఘనత సాధించడం మరో విశేషం. ఇదిలా ఉంటే.. శనివారం నాటి రెండో రోజు ఆట ముగిసే సరికి టీమిండియా ఏడు వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అంతకుముందు ఇంగ్లండ్ 353 పరుగులకు ఆలౌట్ అయింది.

క్యాలెండర్ ఇయర్‌లో టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత క్రికెటర్లు

-యశస్వి జైస్వాల్- 23లి సిక్సర్లు- 2024లో
-వీరేంద్ర సెహ్వాగ్- 22 సిక్సర్లు- 2008లో
-రిషభ్ పంత్- 21 సిక్సర్లు- 2022లో
-రోహిత్ శర్మ- 20 సిక్సర్లు- 2019లో
-మయాంక్ అగర్వాల్- 18 సిక్సర్లు- 2019లో.

## సందీప్ కిషన్.. లక్కు మాములుగా లేదు



యంగ్ హీరో సందీప్ కిషన్ తాజాగా ఊరు పేరు భైరవకోన సినిమాతో ప్రేక్షకుల ముందుకి వచ్చారు. ఈ సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో ఆడియన్స్ కి బాగానే కనెక్ట్ అవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తర్వాత సందీప్ కిషన్ ఖాతాలో మరో బెస్ట్ మూవీగా ఈ సినిమా చేరే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. సందీప్ కిషన్ తన నెక్స్ట్ మూవీని త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకి సంబందించిన అఫీషియల్ ప్రకటన రావాల్సి ఉంది. అయితే ఇప్పుడు సందీప్ కిషన్ మరో క్రేజీ ప్రాజెక్ట్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడంట. రాజ్ అండ్ డీకే ద్వయంలో వచ్చిన వెబ్ సిరీస్ ఫ్యామిలీ మెన్ 1, ఫ్యామిలీ మెన్ 2. ఈ సిరీస్ లో సీజన్ 3 కూడా స్టార్ట్ కాబోతుందంట. ఫ్యామిలీ 3 వెబ్ సిరీస్ ని త్వరలో పట్టాలు ఎక్కించాలని ఈ దర్శకులిద్దరు ప్లాన్ చేసుకుంటున్నారు. ఇందులో సందీప్ కిషన్ ఓ కీలక పాత్రలో నటిస్తాడని తెలుస్తోంది. ఫ్యామిలీ మెన్ 2లో సమంత విలన్ గా నటించి మెప్పించింది. ఆమె బోల్డ్ అండ్ యాక్షన్ పెర్ఫార్మెన్స్ కి బాలీవుడ్ ఆడియన్స్ కూడా ఫిదా అయిపోయారు. వారితోనే సమంత సిటాడెల్ ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ చేసింది.. త్వరలో ఈ వెబ్ సిరీస్ రిలీజ్ కానుంది. దీని తర్వాత ఫ్యామిలీ మెన్ 3 స్టార్ట్ అవుతుందని తెలుస్తోంది. అయితే ఈ సిరీస్ లో సందీప్ కిషన్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నాడు అనేది క్లారిటీ లేదు. సమంత కూడా ఈ సిరీస్ లో ఉంటుందా లేదా అనేది తెలియాల్సి ఉంది. ఒక వేళ సమంత కూడా నటిస్తే కచ్చితంగా ఫ్యామిలీ మెన్ 3కి మంచి హైప్ వచ్చే ఛాన్స్ ఉంది. ఊరు పేరు భైరవకోన సినిమాతో సందీప్ కిషన్ మరల తన ఇమేజ్ ని న నిలబెట్టుకున్నాడు. ఇదే స్పీడ్ తో నెక్స్ట్ కూడా డిఫరెంట్ కథలతో మూవీస్ చేస్తూ మార్కెట్ ని ఎంత వరకు పెంచుకుంటాడు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అలాగే ఫ్యామిలీ మెన్ 3 వెబ్ సిరీస్ ద్వారా సందీప్ కిషన్ గ్రాండ్ గా డిజిటల్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు అని స్పష్టం అవుతోంది.

## మా సినిమాకు పిల్లలు రావొద్దు.. 'తంత్ర' నుంచి వెరైటీ వార్నింగ్




తమ సినిమాకు 'ఎ' సర్టిఫికెట్ రావడంపై 'తంత్ర' మూవీ టీం వినూత్నంగా స్పందించింది. ఈ సినిమాకు పిల్లలు రావొద్దని హెచ్చరిస్తూ 'ఎ'ని హైలైట్ చేస్తూ పోస్టర్‌ను ముద్రించింది. మంచి హారర్ ఎలిమెంట్స్‌తో ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తుందని కాన్ఫిడెంట్‌గా ఉన్న మేకర్స్ ఈ సినిమాకు చిన్నపిల్లలు రాకుండా పోస్టర్ ముద్రణ నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిజానికి దీనిని కూడా క్రియేటివ్ ప్రమోషనల్ స్ట్రాటజీగా చెప్పొచ్చు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు యూత్‌ని ఎంటర్‌టైన్ చేస్తున్నాయి. పల్లెటూరి అమ్మాయిగా, క్షుద్రపూజలకు గురైన బాధితురాలిగా అనన్య నాగళ్ల ఒదిగిపోయింది. 'ధీరే ధీరే' సాంగ్‌లో కుర్రకారు మనసుల్ని మెలిపెట్టేసింది. అనన్యకు జోడీగా శ్రీహరి కుటుంబం నుంచి వచ్చిన ధనుష్ రఘుముద్రి మంచి స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నాడు. అలాగే, మర్యాద రామన్న ఫేం సలోనీ, టెంపర్ వంశీ, మీసాల లక్ష్మణ్, కుశాలిని తదితరులు ఈ హార్డ్ హిట్టింగ్ హారర్ డ్రామాకి మరింత డోస్ పెంచినట్టు దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి చెప్పాడు.ఫస్ట్ కాపీ మూవీస్, బి ద వే ఫిల్మ్స్ బ్యానర్స్ కలిసి రూపొందించిన ఈ సినిమా ట్రైలర్‌ని త్వరలోనే విడుదల చేయనున్నట్టు నిర్మాతలు నరేశ్‌బాబు, రవిచైతన్య ప్రకటించారు. మార్చి 15న సినిమాను విడుదల చేయనున్నారు.

## బేబీ బంప్ ఫొటోలు షేర్ చేసిన మనోజ్ భార్య మౌనిక



సినీ హీరో మంచు మనోజ్, దివంగత భూమా నాగిరెడ్డి కూతురు మౌనిక గత ఏడాది పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. మౌనిక ప్రస్తుతం గర్భవతి. తమ కుటుంబంలోకి మరో బుజ్జాయి వస్తున్నాడంటూ గత డిసెంబర్ లోనే మౌనిక తన ప్రెగ్నెన్సీ గురించి వెల్లడించింది. తాజాగా తన బేబీ బంప్ ఫొటోలను షేర్ చేసింది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీరిద్దరికీ ఇది రెండో వివాహం కావడం గమనార్హం. తొలి భర్తతో మౌనికకు ధైరవ్ అనే కొడుకు ఉన్నాడు. ధైరవ్ ను కూడా మనోజ్ సొంత కొడుకుగానే చూసుకుంటున్నారు. పెళ్లి తర్వాత మనోజ్ స్పందిస్తూ... కలిసొచ్చే కాలానికి ఎదురొచ్చే కొడుకు పుడతాడని అంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కెరీర్ విషయాల్లోకి వస్తే కొత్త సినిమాతో రీఎంట్రీ ఇచ్చేందుకు మనోజ్ రెడీ అవుతున్నాడు. పిల్లల కోసం ఆట వస్తువులు, బొమ్మలు తయారు చేసి, అమ్మే కంపెనీని మౌనిక ప్రారంభించింది.

## సీతారామం 2 ఉంటుంది కానీ..?



హను రాఘవపుడి దర్శకత్వంలో వైజయంతి మూవీస్ బ్యానర్ లో తెరకెక్కిన సీతారామం సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ లీడ్ పెయిర్ గా నటించగా సినిమాలో ఇంపార్టెంట్ రోల్ లో రష్మిక మందన్న నటించింది. ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ అందించిన మ్యూజిక్ కూడా ఎంతో హెల్ప్ అయ్యింది. అప్పటివరకు బాలీవుడ్ లో సినిమాలు చేస్తున్నా పెద్దగా గుర్తింపు రాని మృణాల్ ఠాకూర్ సీతరామం తో స్టార్ క్రేజ్ తెచ్చుకుంది. సినిమాలో సీతామహాలక్ష్మి, నూర్జహాన్ పాత్రలో మృణాల్ నటన ఆకట్టుకుంది. . గ్లోరియస్ కెమిస్ట్రీ మహానటి తర్వాత దుల్కర్ సల్మాన్ తో వైజయంతి బ్యానర్ అదే రేంజ్ సీతారామం తో కూడా అందుకుంది.సీతారామం వెండితెర మీద చేసిన మ్యాజిక్ ఆడియన్స్ ని బాగా కనెక్ట్ అయ్యింది. ఆ సినిమా చివర్లో రామ్ కోసం సీత అదే నూర్జహాన్ ఎదురుచూస్తూ ఆమె కథ కూడా పూర్తవుతుంది. ఈ పాత్రలకు బాగా ఎంగేజ్ అయిన ఆడియన్స్ ఆ సినిమాను కొనసాగిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. హను రాఘవపుడి కూడా సీతారాం 2 పై ఆసక్తిగా ఉన్నట్టు తెలుస్తుంది. హను రాఘవపుడి ప్రభాస్ తో సినిమాకు రెడీ అవుతున్నాడు. అయితే ఆ సినిమా 2025 చివర్లో కానీ 2026 ఫస్ట్ హాఫ్ లో సెట్స్ మీదకు వెళ్తుంది. ఈలోగా సీతారామం 2 కథ పూర్తి చేయాలని ఫిక్స్ అయ్యాడట హను. సీతారామం 2 ఉంటుంది కానీ సీతా రామ కథలు అక్కడితో పూర్తయ్యాయి అయితే ప్రేక్షకులు ఆ పాత్రల మీద ఏర్పరచుకున్న అభిమానంతో మరో కొత్త కథలో వారిద్దరిని భాగం చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఎలాగు పాత్రలు వాటి స్వభావాలు ప్రేక్షకులకు ఎక్కేశాయి కాబట్టి వాటితోనే కొత్త కథ చెబితే ఇంపాక్ట్ కూడా ఎక్కువ ఉంటుందని భావిస్తున్నారు. హను ప్రస్తుతం ఆ ప్లానింగ్ లోనే ఉన్నట్టు తెలుస్తుంది. సో సీతారామం 2 ఉంటే మాత్రం మరోసారి దుల్కర్ సల్మాన్, మృణాల్ కలిసి నటించే అవకాశం ఉంది. ఈ హిట్ పెయిర్ జత కడితే చూడాలని ఆడియన్స్ కూడా ఎదురుచూస్తున్నారు. వైజయంతి బ్యానర్ లో వస్తున్న కల్కి సినిమాలో కూడా దుల్కర్ సల్మాన్ గెస్ట్ రోల్ చేస్తున్నాడని తెలుస్తుంది. సో దుల్కర్ తెలుగు సినిమాలన్నీ ఆ బ్యానర్ లోనే చేస్తుండటం స్పెషల్ గా చెప్పుకోవచ్చు.